

ఆక్వాపై అగ్రరాజ్యం సెగ!

ఎగుమతులపై 27 శాతం సుంకం విధించిన అమెరికా


రొయ్యలను ప్యాకింగ్ చేస్తున్న కార్మికులు

> ఆక్వా ఉత్పత్తుల ఎగుమతిపై అగ్రరాజ్యం అమెరికా విధించిన 27 శాతం సుంకం జిల్లాలోని ఆక్వా పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ సుంకం కారణంగా 30 కౌంట్ ఉన్న రొయ్యలను ఎగుమతి చేయాలంటే కిలోకు రూ.130 అదనపు భారం పడనుంది. ఇప్పటికే 50 కౌంట్ కంటే తక్కువ ఉన్న రొయ్యల కొనుగోళ్లను ఎగుమతిదారులు నిలిపివేశారు. విద్యుత్ చార్జీల రూపంలో ప్రస్తుతం రైతులు పెనుభారం మోస్తున్నారు. పెరిగిన మేత ధరలతో అవస్థలు పడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆక్వా సాగు ఎలా చేయాలి అనే అంశం రైతుల్లో తీవ్ర చర్చ నడుస్తోంది.

- 30 కౌంట్ ఉన్న రొయ్యల ఎగుమతికి కిలోకు రూ.130 అదనపు భారం
- నిలిచిన 50 కౌంట్ కంటే తక్కువ ఉన్న రొయ్యల కొనుగోళ్లు
- ఇప్పటికే విద్యుత్ చార్జీల రూపంలో రైతులపై పెనుభారం
- పెరిగిన మేత ధరలతో అవస్థలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లాలో 111 కిలో మీటర్ల సముద్ర తీరం ఉంది. లక్ష ఎకరాలకు పైగా రొయ్యల సాగు జరుగుతోంది. ఏటా 2.52 లక్షల టన్నుల రొయ్యల ఉత్పత్తి జరుగుతుందని అంచనా. దీంతో పాటు సముద్రపు వేట ద్వారా లభించే రొయ్యలను కూడా విదేశాలకు ఎగుమతి చేస్తారు. చెరువుల్లో సాగు చేసే రొయ్యలు 30 కౌంట్ వచ్చేవరకు రైతులు ఆగుతారు. ఈ తరుణంలో 30 నుంచి 50 కౌంట్ ఉన్న రొయ్యలు చెరువుల్లో అధికంగా ఉంది. వేసవిలో కొనుగోలు చేసిన రొయ్యలను ప్రాసెసింగ్ చేసి ఓడల ద్వారా డిసెంబరు నాటికి అమెరికాకు ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం అమెరికా విధించిన సుంకం కారణంగా 30 కౌంట్ ఉన్న రొయ్యలను ఎగుమతి చేయాలంటే కిలోకు రూ.130 అదనపు భారం పడుతుందని, దీంతో స్థానికంగా రొయ్యల ధర తగ్గిపోతుందని రైతులు చెబుతున్నారు. ఈ వ్యత్యాసాన్ని ఎగుమతిదారులు భరిస్తారా లేక రైతులకు ఇచ్చే ధరలోనే కోతపెడతారా అనే అంశంపై రైతుల్లో చర్చ జరుగుతోంది. ఆక్వా ఎగుమతులకు బ్రేక్ పడకుండా ఎగుమతిదారులు కొంతమేర భారం తమపై వేసుకునేందుకు ముందుకు వస్తారా లేదా అనే అంశంపై వారం రోజుల వ్యవధిలో స్పష్టత వస్తుందని స్థానికంగా రొయ్యలు కొనుగోలు చేసే వ్యాపారులు చెబుతున్నారు. మన దేశం నుంచి అమెరికా, చైనా తదితర దేశాలకు రొయ్యలఎగుమతి జరుగుతుందని, పెద్ద కౌంట్ ఉన్న రొయ్యలు అధికంగా అమెరికాకు ఎగుమతి అవుతాయని పెద్ద వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా విధించిన 27 శాతం మేర సుంకం ప్రభావం తప్పనిసరిగా ఆక్వా రైతులపై పడుతుందని చెబుతున్నారు.

కొనుగోళ్లు నిలిపివేత

ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులపై అమెరికా సుంకం పెంచడంతో 50 కౌంట్ కంటే పెద్ద రొయ్యల కొనుగోలును ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులు, ఎగుమతి దారులు నిలిపివేశారు. కిలోకు 50, 60, 70, 80, 90, 100 కౌంట్ ఉన్న రొయ్యలనే ప్రస్తుతం కొనుగోలు చేస్తున్నారు. అదికూడా ధరలు తగ్గించి మరీ చేస్తున్నారు. వారం రోజుల క్రితం వరకు కిలోకు 100 కౌంట్ ఉన్న రొయ్యలు రూ.250 మేర ధర ఉండగా, గత రెండు రోజులుగా ఈ ధరను రూ.200లకు తగ్గించివేశారు. 60 కౌంట్ ఉన్న రొయ్యల ధర గతంలో రూ.330 వరకు ఉండగా నేడు రూ.250కు పడిపోయింది. 50 నుంచి 100 కౌంట్ ఉన్న రొయ్యలను చైనా దేశానికి ఎగుమతి చేసేందుకే కొనుగోలు చేస్తున్నామని, పరిస్థితులు చక్కబడేవరకు అమెరికాకు రొయ్యల ఎగుమతులు ఉండవని ఎగుమతిదారులు చెప్పడం గమనార్హం. ఇప్పటికే తమ వద్ద ఉన్న సరుకును ఏ పద్ధతిలో ఎగుమతి చేయాలో తెలియడం లేదని, 30, 40, 50 కౌంట్ ఉన్న రొయ్యలను ఇప్పట్లో కొనుగోలు చేయబోమని ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులు, ఎగుమతిదారులు స్పష్టం చేస్తున్నారు.

స్థానికంగా ఉన్న ఇబ్బందులు ఇవీ

ఏటా నవంబరు నుంచి జూన్ వరకు రొయ్యల సాగుకు అనుకూలంగా ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వం ఆక్వా జోన్‌లో ఉన్న భూములకే విద్యుత్‌పై సబ్సిడీని ఇస్తామని ఆంక్షలు పెట్టింది. తీర ప్రాంతంలో అసైన్డ్ భూములే అధికంగా ఉండగా, వేరే పంటలు సాగు చేసే అవకాశం లేకపోవడంతో ఈ భూముల్లో రొయ్యల చెరువులను రైతులు సాగు చేస్తున్నారు. గతంలో అసైన్డ్ భూముల్లో సాగు చేసే రొయ్యల చెరువులకు కూడా విద్యుత్ సబ్సిడీ ఇచ్చేవారు. ఆక్వా జోన్ అంశం తెరపైకి వచ్చాక అసైన్డ్ భూముల్లో సాగు చేసే రొయ్యల చెరువులకు విద్యుత్‌పై రాయితీని ఎత్తివేశారు. దీంతో రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్న భూములనే ఆక్వా జోన్ పరిధిలోకి తెచ్చి మిగతా 6లో..



నిర్లక్ష్యం!

- విజయవాడ వెస్ట్ బైపాస్‌లో కుంగిన కీలక ఆర్‌వోబీలు
- పిన్నమనేని దగ్గర, గన్నవరం, జక్కంపూడిలో తొలగింపు
- రెండుచోట్ల పునర్నిర్మాణ పనులు సాగుతున్న వైనం
- రైతుల వివాదం నేపథ్యంలో వెలుగు చూడని వ్యవహారం
- కోర్టు వివాదాలతో జాప్యం..పునర్నిర్మాణానికి వెసులుబాటు
- అదే ఇప్పటికే ప్రారంభించి ఉంటే.. పరువు పోయేది!

> కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యం కారణంగా విజయవాడ వెస్ట్ బైపాస్‌లో నిర్మించిన కీలకమైన ఆర్‌వోబీలు దేనికీ పనికి రాకుండాపోయాయి. చిన్న అవుటపల్లి నుంచి జక్కంపూడి వరకు నిర్మించిన వాటిలో కొన్నింటిని మట్టితో సహా తొలగించి తిరిగి పునర్నిర్మించాల్సిన దుస్థితి ఏర్పడింది. ల్యాంకో విద్యుత్ లైన్ల అలైన్‌మెంట్‌పై రైతులు న్యాయస్థానాలను ఆశ్రయించటంతో జరుగుతున్న జాప్యం వల్ల కాంట్రాక్టు సంస్థ గుట్టుచప్పుడు కాకుండా ఈ ఆర్‌వోబీలను తొలగించి మళ్లీ పునర్నిర్మిస్తోంది. అదే రైతుల వివాదం లేకపోతే.. గొల్లపూడి వరకు వెస్ట్ బైపాస్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చేది. ఆర్‌వోబీలు కుంగిపోయి పరువు పోయేది. అంతా మంచికే అన్నట్టు రైతుల వివాదం కాస్తా కాంట్రాక్టు సంస్థకు కలిసి వచ్చింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ వెస్ట్ బైపాస్ పనుల్లో అంతులేని నిర్లక్ష్యం చోటు చేసుకుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఈ పనుల్లో అణువణువునా అలసత్వమే రాజ్యమేలుతోంది. గతంలో వేసిన రోడ్డుకు బీటలు వారిన ఘటనలను పలుమార్లు 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకువచ్చింది. తాజాగా ఆర్‌వోబీ(రోడ్డు ఓవర్ బ్రిడ్జి)లనే పూర్తిగా తొలగించి మళ్లీ పునర్నిర్మిస్తున్నారంటే ఎంత భారీ స్థాయిలో లోపాలు చోటు చేసుకున్నాయో అర్థమవుతోంది. చిన్న అవుటపల్లి నుంచి జక్కంపూడి వరకు నిర్మించిన ఆర్‌వోబీలు లోపభూయిష్టంగా నిర్మాణాలు జరిగాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తగిన పర్యవేక్షణ లేకపోవటంతో ఆర్‌వోబీల పనులు ఇష్టారాజ్యంగా జరిగాయి. నిర్మించిన ఆర్‌వోబీలు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. దీంతో మళ్లీ ఈ ఆర్‌వోబీల పునర్నిర్మాణ పనులను కాంట్రాక్టు సంస్థ చేపడుతోంది. చాలా కీలకమైన, అత్యంత ప్రధానమైన ఆర్‌వోబీలనే తొలగించి పునర్నిర్మించాల్సి వస్తోంది.

అన్ని కీలకమైన ఆర్‌వోబీలే..

పదహారవ నంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16)కి అనుసంధానంగా కృష్ణాజిల్లా చిన్న అవుటపల్లి నుంచి మొదలయ్యే వెస్ట్ బైపాస్ పనుల్లోనే నిర్లక్ష్యం చోటు చేసుకుంది. పిన్నమనేని మెడికల్ కాలేజీ ఎదురుగా మిగతా 6లో..

మచిలీపట్నంలో వైభవంగా శోభాయాత్ర



6లో

కనకదుర్గమ్మకు కదంబ పుష్పార్చన



6లో

మద్దతు ధరకే ధాన్యం మొత్తం కొనాలి

గంజాయి 'పుష్ప'లు

- ముందు కూలీలు... ఆ తర్వాత స్మగ్లింగ్ లీడర్లు
- గంజాయి సరఫరాలో అంతకంతకూ ఎదుగుతున్న స్మగ్లర్లు
- ఒడిశా నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా సరఫరా
- స్మగ్లర్లుగా వ్యవహరిస్తున్న చిత్తూరు జిల్లా యువకులు
- రెండు రోజుల కిందట నగరంలో అరెస్టు
- విచారణలో వినిపిస్తున్న పుష్ప సినిమా పోలిన కథలు

> ముందు కూలీగా పనికి వెళ్తాడు. తర్వాత అడవిలో ఎర్రచందనం చెట్లను నరికే మాఫియాకు డాన్‌గా ఎదుగుతాడు... ఇది పుష్ప సినిమాలో హీరో కథ. ముందు కొనుగోలుదారుల్లా వెళ్తారు. తర్వాత సరఫరాదారులుగా మారతారు. ఆ తర్వాత సరఫరాదారులకు లీడర్లు అయిపోతారు.. ఇది రియల్ లైఫ్‌లో గంజాయి స్మగ్లర్ల కథలు. ఒడిశా సరిహద్దుల నుంచి జరుగుతున్న ఈ గంజాయి సరఫరాలో లక్షలాది రూపాయలు చేతులు మారుతుండగా, వివిధ కేసులను విశ్లేషించిన పోలీసులకు 'పుష్ప' కథలు కోకొల్లలుగా వినిపిస్తున్నాయి.


రెండు రోజుల కిందట విజయవాడ పోలీసులు అరెస్టు చేసిన చిత్తూరు జిల్లా గంజాయి స్మగ్లర్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): షేక్ షాజిద్... చిత్తూరు జిల్లా రామసముద్రం మండలం మినికి గ్రామం అతడి సొంతూరు. షేక్ ఫయాజ్... చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం కొత్తపేట సొంతూరు. ఈ ఇద్దరికీ మధ్యప్రదేశ్‌లోని నాసిక్‌కు చెందిన సంజయ్‌తో సంబంధాలు కలిశాయి. ఇందుకు గంజాయే కారణమైంది. షాజిద్, ఫయాజ్‌ను పటమట పోలీసులు రెండు రోజుల కిందట ఎనికేపాడులో అరెస్టు చేశారు. వారి నుంచి 80 కిలోల గంజాయి, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. షాజిద్‌పై జిల్లాలో గంజాయి కేసులు ఉన్నాయి. వేర్వేరు గ్యాంగ్‌ల కింద ఇతను కూలీగా పనిచేశాడు. చిత్తూరు జిల్లా నుంచి బయల్దేరి ఉత్తరాంధ్ర వరకు వెళ్లేవాడు. అక్కడ సరుకును కొనుగోలు చేసి పోలీసులకు చిక్కకుండా గమ్యస్థానాలకు చేర్చేవాడు. ఇలా గంజాయిని మరికొంతమందితో కలిసి తీసుకెళ్తుండగా, 2017లో చిల్లకల్లు పోలీసులకు చిక్కాడు. షాజిద్‌తో పాటు మిగిలిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి నుంచి అప్పట్లో 520 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తర్వాత కొద్దికాలంపాటు స్తబ్దుగా ఉన్న షాజిద్ మళ్లీ గంజాయి సరఫరాలోకి దిగాడు. సంజయ్.. నాసిక్‌లో గంజాయి వ్యాపారానికి కింగ్‌పిన్‌గా ఉండగా, రెండు, మూడుసార్లు గంజాయిని ఉత్తరాంధ్ర నుంచి నాసిక్‌కు షాజిదే పంపించాడు.

'సిల్క్' గంజాయి

షాజిద్ కుటుంబం చిత్తూరు జిల్లాలో పట్టు పురుగులు సాగు చేస్తోంది. వారు చేనేతలకు మిగతా 6లో..



పండుగ రోజు పెను విషాదం

కొత్తపేట రేవులో మునిగి ముగ్గురు బాలురు మృతి

- మృతుల్లో ఇద్దరు అన్నదమ్ముల పిల్లలు
- మృతులంతా మోదుమూడికి చెందినవారే..
- ప్రాణాల మీదకు తెచ్చిన డీజే సరదా!
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు

> శ్రీరామనవమి పండుగ రోజు అవనిగడ్డ మండలం మోదుమూడి గ్రామంలో పెను విషాదం జరిగింది. రాములోరి కల్యాణం సందర్భంగా ప్రత్యేకంగా తయారు చేయించిన రామ స్థూపాన్ని కృష్ణానదిలో శుద్ధి చేయించేందుకు తీసుకెళ్లిన కార్యక్రమంలో నీటిలో మునిగి ముగ్గురు బాలురు మృతి చెందారు. వీరిలో అన్నదమ్ముల పిల్లలు ఇద్దరు ఉండటం, వారు కూడా ఒక్కో కుటుంబానికి ఒక్కరే వారసులుగా ఉండటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కొత్తగా ఈ ఏడాది ఏర్పాటు చేసుకున్న డీజేనే తమ బిడ్డల ప్రాణాల మీదకు తెచ్చిందని వాపోయారు.


యతిరాజు మృతదేహాన్ని నదిలో నుంచి బయటకు తీసుకొస్తున్న స్థానికులు

అవనిగడ్డ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఏటా శ్రీరామనవమి పర్వదినాన్ని మోదుమూడి గ్రామంలో సాంప్రదాయబద్ధంగా మేళతాళాలతో నిర్వహించి గ్రామంలో ఏర్పాటు చేసుకునే రామ స్థూపాన్ని నదికి తీసుకెళ్లి శుభ్రపరిచి అనంతరం గ్రామంలో సీతారాముల కల్యాణాన్ని చేస్తూ ఉంటారు. ఈ ఏడాది కొత్తగా డీజే పెట్టి శ్రీరామనవమి ఉత్సవాలను నిర్వహించాలని స్థానిక యువకులు నిర్ణయించుకుని మత్తి గోపీ కిరణ్ ఇంటి సమీపంలో రామ స్థూపాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలలోపు రామస్థూపాన్ని కొత్తపేట కృష్ణానది ఘాట్ వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లగా, యువత సరదాగా డీజేలు పెట్టుకుని వెళ్లటంతో వారు మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి కొత్తపేట రేవుకు చేరుకున్నారు. ఆ సమయంలో ఘాట్ వద్ద ఎవరు మిగతా 6లో..


గోపీ కిరణ్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు


వీరబాబు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు



గుడివాడ రూరల్ మండలం మోటూరులో ఆదివారం శ్రీసీతారామస్వామి కల్యాణానికి హాజరైన భక్తులు

తలంబ్రాలు చూపిస్తున్న అర్చకులు

కనకదుర్గమ్మకు కదంబ పుష్పార్చన



ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజల చింతలు తీర్చే చింతామణి గృహ నివాసిని కనకదుర్గమ్మకు చైత్రమాస వసంత నవరాత్రుల్లో ఎనిమిదో రోజైన ఆదివారం కదంబపుష్పాలను సమర్పించారు. శ్రీచక్ర నగరవాసిగా దుర్గమ్మను కొలుస్తారు. మొత్తం 25 ప్రాకారాల మధ్యలో ఉండే అమ్మవారిని ప్రసన్నం చేసుకోవాలంటే సుగంధభరితమైన పుష్పార్చనతోనే సాధ్యమని చెబుతారు. అందుకనే అమ్మవారికి కుంకుమ పూజతో పాటు పుష్పార్చన కూడా ప్రధానమైనది. ఇంద్రకీలాద్రిపై కనక దుర్గమ్మవారిని ఆదివారం సుగంధ పరిమళ భరిత సంపెంగలు, చామంతి పూలతో అర్చించారు. మరువం, దవనం, మందారాలు, గులాబీలు, ఎర్ర తామరపూలు, వంటి వాటిని అమ్మవారికి సమర్పించారు. పూజ అనంతరం పంచహారతులు ఇచ్చి శాంతి మంత్రాలు చదివి ముగించారు. భక్తులకు అమ్మవారి ఆశీస్సులు అందజేశారు.



దశావతార వెంకన్న సన్నిధిలో జరిగిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు (ఇన్ సెట్లో సీతారాములు)

దశావతార సన్నిధికి పోటెత్తిన భక్తులు

» భక్తులకు భారీగా అన్నసంతర్పణ

పెదకాకాని, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల ఈ దశావతార వెంకన్న స్వామి దివ్య క్షేత్రంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరిపించారు. వేదమంత్రాలతో సాంప్రదాయ బద్ధంగా కల్యాణాన్ని కమనీయంగా జరిపించారు. ఆలయ ప్రాంగణంలో రాముల వారు, సీతాదేవి ఉత్స విగ్రహాలను ఏర్పాటుచేసి కల్యాణం జరిపించారు. వేలాది మంది భక్తుల ఆనందోత్సాహాల మధ్య సీతారాముల కల్యాణాన్ని ఇక్కడ రమణీయంగా జరిపించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణ జిల్లాలతోపాటు హైదరాబాదు నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. కల్యాణ అనంతరం భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. భక్తులకు కళ్యాణాన్ని పురస్కరించుకొని భారీ అన్న సంతర్పణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు దంపతులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



ఇంద్రకీలాద్రిపై దుర్గగుడిలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, వేద పండితులు

సీతారాముల కల్యాణం చూతము రారండి..

శ్రీరామనవమి వేడుకలు ఆదివారం నగరవ్యాప్తంగా వైభవంగా జరిగాయి. సంస్కృతి, వీరత్వం, సూత్రాలు, నైతికత, సుపరిపాలన, వినయం, త్యాగాలను ప్రతిబింబించే .శ్రీరాముని జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రామభక్తులు రామ కథా పఠనాలు, ఊరేగింపులు నిర్వహించారు.

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం సీతారాముల కల్యాణం క్రతువును స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకుడు ఎల్.దుర్గాప్రసాద్‌లు నిర్వహించారు. తొలుత ఉత్సవమూర్తులను వధూవరులుగా అలంకరించారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం తదితరాల అనంతరం వరపూజ నిర్వహించారు. కంకణధారణ, ఉత్తర జంధ్యాలు వంటి కార్యక్రమాలను వరుడు శ్రీరాముడు పరంగా నిర్వహించారు. కన్యావరణాలు చదివి సీతమ్మ ఉత్సవమూర్తికి వివిధ ఉపచారాలు చేశారు. ఆమెకు కూడా కంకణధారణ చేశారు. ప్రవరులలో అచ్యుత గోత్రోద్భవులు శ్రీరామచంద్రమూర్తికి, సౌభాగ్య గోత్రోద్భవిని సీతామహాలక్ష్మికి వివాహం చేస్తున్నట్టుగా మంత్రపూర్వకంగా ప్రక్రియను నిర్వహించారు. కన్యాదాన క్రమాన్ని మంత్రపూర్వకంగా చెప్పారు. భక్తులను కన్యాదాతలుగా అభివర్ణిస్తూ అటు పదితరాలు, ఇటు పదితరాలు, ఇప్పటితరం మొత్తం 21తరాలు కన్యాదానంవల్ల తరిస్తాయంటూ భక్తులకు వివరించారు. అనంతరం ముహూర్త సమయానికి మహా సంకల్పం చెప్పి జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని శ్రీరాముడు, సీతమ్మ ఉత్సవ మూర్తుల శిరస్సులపై ఉంచారు. మేళ తాళాలు, భక్తుల శ్రీరామ నామం మధ్య వేడుకగా మంగళసూత్రధారణ జరిపించారు. భక్తజన కోలాహలం మధ్య తలంబ్రాల కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు తలంబ్రాల సమయంలో భక్తులు రాములవారిని, సీతమ్మవారిని కీర్తిస్తూ పాటలు పాడి, శ్లోకాలు చదివారు. శ్రీరామ జయరామ జయజయరామ అంటూ భజనలు చేశారు. అనంతరం మాలా పరివర్తన కార్యక్రమాలను నిర్వహించి మంగళహారతులు ఇచ్చి భక్తులకు ఆశీస్సులు అందజేసి కార్యక్రమాన్ని ముగించారు.

బీసెంటు రోడ్డు రామాలయంలో..



గవర్నర్‌పేట : సీతారామకల్యాణ మహోత్సవ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బీసెంట్ రోడ్డు రామాలయం వద్ద సీతారాముల కల్యాణం నిర్వహించారు. కల్యాణ మూర్తులను ప్రత్యేక వాహనంపై వాయిద్యాల నడుమ కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చారు. పోలవరపు వెంకటకృష్ణ సుకుమార్, రాధిక దంపతులు ఉత్సవ మూర్తులకు కల్యాణం నిర్వహించారు. బూర్లగడ్డ కృష్ణకిషోర్, ధనలక్ష్మీ దంపతులు మూలవిరాట్ సన్నిధిలో కళ్యాణం జరిపారు. కళ్యాణం అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని మోడరన్ కేఫ్ యజమాని మురళి రూ.57 వేలకు పాడుకున్నారు. కమిటీ అధ్యక్షుడు నీలం భానుమూర్తి, ఉపాధ్యక్షుడు బూర్లగడ్డ కృష్ణకిషోర్, కార్యదర్శి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కోశాధికారి పోతిన రామప్రసాద్, సభ్యులు కళ్యాణ వేడుకలను పర్యవేక్షించారు.

బందర్ రోడ్డులోని ఏఆర్ గ్రౌండ్స్‌లో..



కళ్యాణ మహోత్సవంలో సీపీ రాజశేఖర్‌బాబు దంపతులు

గుణదల : విజయవాడ నగరం మహాత్మాగాంధీ రోడ్డులోని ఏఆర్ గ్రౌండ్స్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు దంపతులు హాజరై పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం వైభవంగా కల్యాణ మహోత్సవం జరిపించారు. డీసీపీలు సరిత, ఉదయరాణి, ప్రసాద్, ఏడీసీపీలు జి.రామకృష్ణ, ఎ.వి.ఎల్.ప్రసన్న కుమార్, కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మోటూరులో..



గుడివాడ రూరల్: గుడివాడ రూరల్ మండలం మోటూరులో అపర భద్రాద్రిగా పేరుగాంచిన సీతారామస్వామి తిరు కల్యాణ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు, వేదపండితుల నడుమ మోటూరు ఆలయం నందు కల్యాణ కట్టపై స్వామి, అమ్మవార్లకు కళ్యాణం ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తుల సమక్షంలో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆలయ వంశస్థుల ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు, మోటూరు గ్రామస్థుల సహకారంతో వేలాది మంది భక్తులు నడుమ కల్యాణం జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు.

బందరులో వైభవంగా ఉత్సవాలు..



కల్యాణ మహోత్సవంలో ఎస్పీ గంగాధరరావు దంపతులు

మచిలీపట్నం టౌన్ : జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ఆదివారం వివిధ ప్రధాన దేవాలయాల్లో వైభవంగా సీతారాముల కళ్యాణ మహోత్సవాలు జరిగాయి. బందరు పోలీసు కళ్యాణ మండపంలో ఎస్పీ ఆర్.గంగాధరరావు దంపతులు కళ్యాణ వేడుకలో పాల్గొన్నారు. ధర్మం, న్యాయం, కర్తవ్య దీక్షకు శ్రీరాముడు అందరికీ ఆదర్శమన్నారు.

రెండేళ్లకే ప్రపంచ రికార్డు

» చిన్నారి ఆర్నా అద్భుత మేధస్సు



వరల్డ్ రికార్డు సాధించిన చిన్నారి ఆర్నా

విజయవాడ(స్పోర్ట్స్), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : పిట్ట కొంచెం కూత ఘనం.. సామెతను నిజంచేస్తూ చిన్నారి అద్భుతమైన మేధస్సుతో ప్రపంచ రికార్డు సాధించింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉంటున్న వెంకట శివ, తేజస్వీల కుమార్తె ఆర్నా చింతలపూడి రెండేళ్ల వయస్సులోనే అద్భుత మేధాశక్తితో రెండు నిమిషాల వ్యవధిలో 36 సముద్ర జంతువులను గుర్తించడంతో పాటు వాటి పేర్లను చెబుతోంది. గత మార్చి 18న కాలిఫోర్నియాలోని ఫ్రీమౌంట్‌లో బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో ప్రపంచ రికార్డు నెలకొల్పినట్టు పటమటలో ఉంటున్న చిన్నారి తాతయ్య వీరేంద్రకుమార్ తెలిపారు.

మద్దతు ధరకే ధాన్యం మొత్తం కొనాలి

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



ఈలప్రోలులో ధాన్యం రైతులతో మాట్లాడుతున్న సీపీఐ రామకృష్ణ

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : తేమశాతం ఎక్కువగా ఉందని కుంటిసాకులు చెప్పకుండా రబీలో ధాన్యం మొత్తాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలు గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో సమావేశమయ్యారు. ధాన్యం విక్రయాల్లో ఎదురవుతున్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం, ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం కారణంగా రైతులు దళారులకు ధాన్యాన్ని తెగనమ్ముకోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క వాతావరణం.. మరో పక్క అధికారులు అన్నదాతలతో ఆడుకుంటున్నారని దుయ్యబట్టారు. దీంతో రైతులు బస్తాకు రూ.500లు తక్కువగా అమ్ముకోవాల్సి వస్తుందన్నారు. బుడమేరు వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పంటకు కనీస మద్దతు ధర దక్కకపోవడం బాధాకరమన్నారు. ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ, అధికారులు, మిల్లర్లు కలిసి రైతుల కష్టార్జితాన్ని కాజేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసి ధాన్యం సేకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, రైతులకు అవసరమైన గోనెసంచులను అందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, మల్నీడి యల్లమందరావు, బుడ్డి రమేష్, పెయ్యల వెంకటేశ్వరరావు, నిమ్మగడ్డ వాసు, సాంబశివరావు, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.



మచిలీపట్నంలో శ్రీరామ శోభాయాత్ర, శివాజీ వేషధారణలో భక్తులు, ఝాన్సీలక్ష్మీబాయి వేషధారణలో మహిళలు (కింద)

వైభవంగా శోభాయాత్ర

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా శ్రీరామ శోభాయాత్ర వైభవంగా జరిగింది. మహిళలు ఝాన్సీలక్ష్మీబాయి వేషాన్ని ధరించి బుల్లెట్‌పై ర్యాలీలో పాల్గొనడం విశేషం. యువకులు ఛత్రపతి శివాజీ, శ్రీరాముని వేషధారణలో ర్యాలీలో పాల్గొన్నారు. హిందూ కళాశాల నుంచి ప్రారంభమైన శోభాయాత్ర నాగపోతరావుసెంటర్, రాజుపేటసెంటర్, కోనేరుసెంటర్, రాజాసెంటర్,



బస్టాండ్ సెంటర్ల మీదుగా హిందూ కళాశాలకు చేరుకుంది. గుడివాడ ప్రణవాశ్రమ అధిపతి స్వామి స్థైర్యానంద సరస్వతి స్వామి యాత్రను కాషాయ జెండా ఊపి ప్రారంభించారు. గుడివాడ ప్రణా వశ్రమ అధిపతి స్వామి స్థైర్యానంద సరస్వతి అభిభాషణం చేశారు. కళాకారులు కోలాట ప్రదర్శన నిర్వహించారు. చిట్టికుమారి బృందం నాయకత్వం వహించారు.



గంజాయి 'పుష్ప'లు

(5వ పేజీ తరువాయి)

సిల్క్‌ను కూడా సరఫరా చేస్తుంటారు. ఈ నేపథ్యంలో రామసముద్రంలో ఉన్న స్నేహితుల ద్వారా నాసిక్‌లో కొంతమందితో పరిచయం పెంచుకున్న షాజిద్.. 2017 నుంచి ఆ బంధాలు కొనసాగిస్తున్నాడు. అప్పట్లో చిల్లకల్లు పోలీసులకు చిక్కిన షాజిద్.. ఆ తర్వాత వేర్వేరు వ్యక్తులతో గంజాయి సంబంధాలు కొనసాగించినప్పటికీ పోలీసులకు మాత్రం చిక్కలేదు. ముందుగా నాసిక్‌లో వివిధ గ్యాంగ్‌ల్లో కూలీగా ఒడిసా, ఉత్తరాంధ్ర సరిహద్దులకు వచ్చాడు. తర్వాత తానే స్మగ్లింగ్‌కు కింగ్‌గా మారాడు. కూలీగా వెళ్లిన దానికంటే ప్రధాన స్మగ్లర్‌గా ఉంటేనే డబ్బు బాగా గిట్టుబాటు అవుతోందని భావించాడు. మధ్యప్రదేశ్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న కారును గంజాయి స్మగ్లింగ్ కోసం కొన్నాడు. ఎంపీ 06 బీఏ 0710 నెంబరు కలిగిన ఈ కారును చిత్తూరు జిల్లాకు తీసుకొచ్చాడు. అక్కడి నుంచే గంజాయి స్మగ్లింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. గంజాయి కావాలని నాసిక్ నుంచి ఎవరైనా ఫోన్ చేస్తే బేరం మాట్లాడుకుంటాడు. అక్కడి నుంచి వచ్చిన మరొకరిని కార్లో తీసుకుని సరుకు కోసం మన్యానికి తీసుకెళ్తాడు. ఆ విధంగా ఫయాజ్‌ను తీసుకుని వస్తుండగా, నగరంలోని ఎనికేపాడులో పటమట పోలీసులకు దొరికిపోయాడు. ఫయాజ్ స్వయంగా డ్రైవర్ కావడంతో కారును నడపడానికి అతడిని వెంటబెట్టుకుని వచ్చాడు. నర్సీపట్నంలో రూ.2.50 లక్షలకు 80 కిలోల గంజాయిని కొనుగోలు చేసి నాసిక్‌కు బయల్దేరాడు. పక్కా సమాచారం రావడంతో పటమట పోలీసులు ఈ తరలింపును తొలిలోనే అడ్డుకున్నారు.

ఆక్వాపై అగ్రరాజ్యం సెగ!

(5వ పేజీ తరువాయి)

అసైన్డ్ భూములను మినహాయించడంతో ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ అందని పరిస్థితి నెలకొంది. ఆక్వాజోన్‌లో ఉన్నప్పటికీ ఒక్కో రైతుకు 10 ఎకరాల వరకే విద్యుత్ రాయితీని ఇస్తామని గత ప్రభుత్వం మెలికపెట్టింది. తాము సాగు చేస్తున్న రొయ్యల చెరువులను ఆక్వా జోన్ నుంచి తొలగించారని, దీంతో విద్యుత్ రాయితీ రావడం లేదని రైతులు గతంలోనూ, ఇప్పుడు ప్రజాప్రతినిధుల చుట్టూ నెలల తరబడి తిరుగుతూనే ఉన్నారు. చూస్తాం, చేస్తామని చెప్పడమే తప్ప సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు.

రూ.వేలల్లో వచ్చే విద్యుత్ బిల్లు నేడు లక్షల్లోకి..

రొయ్యల చెరువులకు సంబంధించి యూనిట్‌కు విద్యుత్ బిల్లుగా రూ.3.84లను వసూలు చేసేవారు. దీనికి అదనంగా మరో ఐదుపైసలను చేర్చి యూనిట్‌కు రూ.3.90 వరకు వసూలు చేస్తున్నారు. 100 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా 10ఎకరాల్లోపు విద్యుత్‌ను వాడుకుంటే ఒక్కో యూనిట్‌కు రూ.2.35 రాయితీగా వచ్చేది. దీంతో రైతులు నెలకు రూ.50 వేల నుంచి 60 వేల వరకు విద్యుత్ బిల్లులను చెల్లించేవారు. ప్రస్తుతం ఆక్వా జోన్‌లో భూమి నమోదై లేదనే కారణంతో విద్యుత్ రాయితీ ఎత్తివేయడంతో 100 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ వాడుకున్నందుకు నెలకు రూ.1.50 లక్షల నుంచి రూ.1.70 లక్షల వరకు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. వివిధ రూపాల్లో విద్యుత్ బిల్లులను వసూలు చేస్తుంటంతో నెలకు లక్ష రూపాయలకు పైగా అదనంగా విద్యుత్ బిల్లుల రూపంలో నగదు చెల్లింపు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మచిలీపట్నం మండలం కోన గ్రామంలో ఒక రైతు నెల రోజులుగా రొయ్యల చెరువుల్లో సాగును నిలిపివేశాడు. కనీస చార్జీల కింద రూ.2,500, వివిధ రూపాల్లో మరో రూ.70వేలను బిల్లుగా ఇవ్వడం గమనార్హం. రొయ్యల సాగులో విద్యుత్ బిల్లులు, మేత ఖర్చులు అధికమవుతున్నాయనే కారణంతో రైతులు సాగు చేయాలా, నిలిపివేయాలా అనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో అగ్రరాజ్యం రూపంలో మరో విపత్తు వచ్చి పడటంతో రొయ్యల సాగు రైతులు డోలాయమానంలో పడ్డారు.

నిర్లక్ష్యం!

(5వ పేజీ తరువాయి)

వెస్ట్ బైపాస్ ప్రారంభమే ఆర్‌వోబీతో మొదలవుతోంది. అతిపెద్ద ఆర్‌వోబీ ఇది. ఈ ఆర్‌వోబీని సరిగా నిర్మించలేదు. దీంతో ఈ ఆర్‌వోబీని మొత్తంగా తొలగించి పునర్నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ ఆర్‌వోబీ దాటిన తర్వాత మర్లపాలెం పై ఓవర్ వస్తుంది. మర్లపాలెం ఫ్లైఓవర్ దాటిన తర్వాత గన్నవరం - నూజివీడు రోడ్డులో గన్నవరం ఆర్‌వోబీ వస్తుంది. ఈ ఆర్‌వోబీని కూడా ఇంతకు ముందే నిర్మించారు. ఈ ఆర్‌వోబీని కూడా ఇప్పుడు పూర్తిగా తొలగించేశారు. పునర్నిర్మాణ పనులు చేపడుతున్నారు. జక్కంపూడి పాముల కాల్వ దగ్గర కూడా ఇలాంటి పరిస్థితే ఏర్పడింది. ఇంకా ఇక్కడ పునర్నిర్మాణ పనులు చేపట్టలేదు. విజయవాడ వెస్ట్ బైపాస్‌లోనే అత్యంత కీలకమైన ఆర్‌వోబీలు ఎందుకు పనికిరాకుండా పోవటం.. వాటిని పునర్నిర్మించాల్సి రావటం పెనుసంచలనంగా మారింది.

పనుల్లో తీవ్ర అలసత్వం

పునర్నిర్మాణం చేస్తున్న ఆర్‌వోబీలన్నీ కూడా బయటకు చొచ్చుకు వచ్చేశాయి. ఇవి కూలి సర్వీసు రోడ్డు మీద పడే పరిస్థితి రావటంతో.. వీటిని గప్‌చుప్‌గా భారీ ఎత్తున ప్రొక్లెయిన్లు, లారీలను సిద్ధం చేసి తొలగించేశారు. ఈ ఆర్‌వోబీలలో వీయూపీ దగ్గర కాంక్రీట్ స్లాబ్ తప్పితే రెండు వైపులా నిర్మించిన అప్రోచ్‌లు కుంగిపోయాయి. భారీ ఎత్తున కాంక్రీట్ పలకలను జాయింట్ చేస్తూ నిర్మించిన గోడలు వెలుపలకు తన్నుకువచ్చాయి. ఈ గోడలను నిర్మిస్తున్న దశలోనే మట్టిని నింపి రోలింగ్ చేపట్టారు. ఒకవైపు గోడలను నిర్మిస్తున్న దశలోనే మట్టిని బాగా రోడ్డు రోలర్స్‌తో తొక్కించి సమాంతరంగా అటు వాల్, ఇటు మట్టి ఫిల్లింగ్‌ను చేపట్టారు. ఈ పనుల్లో నిర్లక్ష్యం చోటు చేసుకుందని తెలుస్తోంది. వాల్‌గా కాంక్రీట్ బ్లాక్స్‌ను అనుసంధానించటంలో కూడా లోపాలు చోటు చేసుకున్నాయని సమాచారం. మట్టిని ఫిల్ చేసే విషయంలో కూడా రోలింగ్ సరిగా చేయకపోవటంతో అటు వాల్స్, ఇటు మట్టి మధ్యన బ్యాలెన్స్ తప్పి బయటకు చొచ్చుకువచ్చి కూలటానికి సిద్ధమైనటు సమాచారం.

నిపుణులు ఏమంటున్నారంటే..

విజయవాడ వెస్ట్ బైపాస్‌లో కీలకమైన ఆర్‌వోబీలు బయటకు చొచ్చుకురావటం వల్ల తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడటానికి అనేక కారణాలు ఉంటాయని ఇంజినీరింగ్ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రధానంగా ఫౌండేషన్ సమస్యలు కనిపిస్తున్నాయని, సాయిల్ టెస్ట్ సరిగా నిర్వహించారా అన్న దానిపై కూడా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బలహీనంగా ఉన్న సాయిల్‌పై ఆర్‌వోబీని నిర్మిస్తే అది కుంగిపోవటానికి అవకాశం ఉంటుందని అంటున్నారు. బలహీనమైన సాయిల్ ఈ ప్రాంతాల్లో ఉండి ఉంటే సాయిల్ టెస్ట్‌లో తెలిసేదని, దీని ద్వారా దృఢంగా ఆర్‌వోబీ ఏ విధంగా చేపట్టాలన్నది తెలుస్తుందని పేర్కొంటున్నారు. బలహీనమైన పునాదులు వేసినా కూడా ఈ పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందంటున్నారు. ఈ పునాదుల చుట్టూ వర్షపునీరు చేరినా మెత్తబడి కుంగిపోవటానికి అవకాశం ఉంటుందని, కిందటి సారి కురిసిన భారీ వర్షాల సందర్భంలోనే ఈ ఆర్‌వోబీలలో కుంగుదల సంభవించిందని చెబుతున్నారు. కాబట్టి వర్షపు నీరు వాల్ కాంక్రీట్ బ్లాక్స్ నుంచి లోపలికి చేరి ఉంటుందన్న అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నారు. వాల్స్ మధ్యన మట్టిని నింపే సమయంలోనే రెండు వైపులా షీట్స్ అమర్చుతారని, ఈ షీట్స్ వర్షపు నీటిని లోపలికి చేరనివ్వదని, ఈ ఆర్‌వోబీల డి జైన్ల విషయంలో కూడా లోపాలు చోటు చేసుకున్నాయని భావిస్తున్నారు. తగినంత లోడ్ కాలిక్యులేషన్ లేకుండా నిర్మించటం వల్ల కూడా ఈ పరిస్థితి వచ్చిందేమోనన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనుల్లో తక్కువ గ్రేడ్ కాంక్రీట్, మట్టి ఇతర మెటీరియల్స్ వాడినా కూడా ఇదే పరిస్థితి ఎదురు కావచ్చునని చెబుతున్నారు. కాంక్రీట్ బ్లాక్స్ జాయింట్స్ దగ్గర సరిగా సీల్ వేయకపోవటం వల్ల కూడా సమస్య తలెత్తే ప్రమాదం ఉందని అంటున్నారు. అన్నింటికంటే నిర్వహణ లోపాలు ప్రధాన కారణమన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి.

పండుగ రోజు పెను విషాదం

(5వ పేజీ తరువాయి)

లేకపోవటంతో ఎనిమిది మంది యువకులు స్నానాలకు దిగారు. కొత్తగా ఏర్పడిన గుండాల్లో మత్తి గోపీ కిరణ్ (15), వీరబాబు(15), యతిరాజు(16) గల్లంతు అయ్యారు. వెంటనే వారితో వచ్చిన వారు కొత్తపేట గ్రామంలో సమాచారం అందించారు. వారు వెంటనే అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టగా, యతిరాజ్ మృతదేహం నది ఒడ్డునే లభించింది. గోపీ కిరణ్, వీరబాబు జాడ తెలియకపోవడంతో వెంటనే గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ నేతృత్వంలో రెవెన్యూ, పోలీసు సిబ్బందితో కలసి గాలింపు చర్యలు చేపట్టారు. నాగాయలంక, పులిగడ్డ గ్రామాల నుంచి గజ ఈతగాళ్లను రప్పించారు. ఘాట్ ఎదురుగా కొత్తగా ఏర్పడిన గుండాల్లో చిక్కుకున్న మృతదేహాలను బయటకు తీసుకొచ్చారు. గాలింపు చర్యలను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆయన కుమారుడు మండలి వెంకట్రామ్ పర్యవేక్షించారు. మృతదేహాలను అవనిగడ్డ సీఐ యువకుమార్, ఎస్ఐ శ్రీనివాస్ అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా, పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ సహకారంతో రేవులో దిగి మృతదేహాలను బయటకు తీసిన గజ ఈతగాళ్లు పెనుమూడికి చెందిన విశ్వనాథపల్లి దిలీప్, తమ్మాడి సాయి, లంకే చందు, నాగాయలంకకు చెందిన విశ్వనాథపల్లి వంశీలను అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ, సీఐ యువకుమార్, ఎస్ఐ శ్రీనివాస్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

మూడు కుటుంబాల్లో కడుపు కోత..

మత్తి గోపీ కిరణ్, మత్తి వీరబాబు వారి కుటుంబాలకు ఏకైక వారసులు, అంతేకాకుండా వారిరువురు తండ్రులు సైతం అన్నదమ్ములే కావటంతో ఆయా కుటుంబాలకు వారసులు లేకుండాపోయారని గోపీ కిరణ్ తండ్రి రంగారావు, వీరబాబు తండ్రి వరదరాజులు విలపిస్తున్నారు. గోపీ కిరణ్, వీరబాబు అవనిగడ్డలో 9వ తరగతి చదువుతుండగా, యతిరాజు ఇటీవల చదువు మానేసి వ్యవసాయంలో కుటుంబానికి సాయంగా ఉంటున్నాడు. చేతికి అంది వస్తున్న కొడుకు విగత జీవిగా మారడం చూసి యతిరాజు తండ్రి మత్తి భావన్నారాయణ కన్నీటిపర్యంతమయ్యాడు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

యువకులు గల్లంతైన విషయం తెలుసుకున్న అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తన కుమారుడు మండలి వెంకట్రామ్‌తో కలసి కొత్తపేట ఘాట్‌కు చేరుకుని, అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ, సీఐ యువకుమార్‌ను పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుం బాలను పరామర్శించారు. విషయం తెలుసుకున్న అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అవనిగడ్డ ఏరియా ఆస్పత్రికి చేరుకుని మృతదేహాలను సందర్శించి వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఇసుక అక్రమ తవ్వకాలతోనే గుండాలు

కొత్తపేట పుష్కరఘాట్ వద్ద నది లోతు చాలా తక్కువగా ఉంటుందని, అక్కడ ఒకేసారి పది అడుగుల లోతున గుండాలు ఏర్పడటానికి కారణంగా ఇసుక అక్రమ తవ్వకాలేనని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నది ఒడ్డు నుంచి అవతల వరకు నడిచి వెళ్లిపోయే అవకాశం గతంలో ఉండేదని, ఈ అక్రమ తవ్వకాల కారణంగా నదిలో అనూహ్యంగా గుండాలు ఏర్పడి ప్రాణాల మీదకు తెస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	123, 132, 143
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 440

వైద్య శిబిరానికి విశేష ఆదరణ

పెనమలూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : అనుమోలు ఆదరణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. క్యాపిటల్ ఆసుపత్రి సహకారంతో జరిగిన ఈ వైద్యశిబిరానికి షుమారు 200 మందికిపైగా వైద్యపరీక్షలు చేయించుకొన్నారు. కార్యక్రమంలో ట్రస్టు అధినేత అనుమోలు ప్రభాకరరావు, చెన్నుపాటి శ్రీనివాసరావు, బొంగరాల అబ్రహాం, గూడవల్లి రత్నకిషోర్, అన్వర్, రాధా తదితరులు హాజరయ్యారు.


వైద్యశిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ట్రస్టు అధినేత అనుమోలు ప్రభాకరరావు


జంక్షన్ అభయాంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం.. రంగన్నగూడెంలో ప్రత్యేక పూజలో నాయకులు.. దావాజీగూడెంలో పూజలు చేస్తున్న రామాచార్యులు.. లంకపల్లి రామాలయంలో లవకుశ వేషధారణలో చిన్నారులు.. అంబాపురంలోని దాసాంజనేయ ఆలయంలో..

వైభవంగా సీతారాముల కల్యాణం

- వాడవాడలా నేత్రపర్వంగా సీతారాముల కల్యాణోత్సవాలు
- భారీగా అన్నప్రసాద వితరణ


పోరంకి కోదండ రామాలయంలో.. ఎనికేపాడులోని కోదండ రామాలయంలో.. ప్రొద్దుటూరు శివారు గాయత్రి విహార్‌లో..

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి సందర్భంగా స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానం వద్ద సీతారాముల కల్యాణోత్సవం వేడుకగా నిర్వహించారు. ఆలయ ఈవో తారకేశ్వర రావు పర్యవేక్షణలో కల్యాణ వేడుకను అర్చకులు ఘనంగా జరిపారు. కల్యాణ పీటలపై ఏలూరుకు చెందిన ప్రముఖ వైద్యులు కసుకుర్తి నాగరత్నం హేమంత్‌కుమార్ దంపతులు, డీఎస్పీ మేకా సుధాకర్ దంపతులతో పాటు విజయవాడకు చెందిన కేతినేని రత్నాకరరావు శమంతకమణి, కల్యాణంలో పాల్గొన్న కసుకుర్తి నాగరత్నం హేమంత్‌కుమార్ దంపతులు రెండువేల మందికి అన్నసంతర్పణ చేశారు. హనుమాన్‌నగర్, ఇందిరానగర్, బాపులపాడు గ్రామ ఆలయాల్లో నవమి వేడుకలను ఘనంగా నిర్వహించి అన్నసంతర్పణలు చేశారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : మండల వ్యాప్తంగా గ్రామాల్లో శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం రాములోరి కళ్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. కాకులపాడు సీతారామచంద్రస్వామి దేవస్థానంలో అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీతా రాముల కల్యాణం నిర్వహించారు. కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రత్యేక పూజలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వీరవల్లి సాయిబాబా మందిరంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో లంక వెంకటేశ్వర రావు, పద్మశ్రీ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. రంగన్నగూడెం రామాలయంలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో ఎనెస్సీ ఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తుమ్మల దశరధరామయ్య, ముక్కపాటి సత్యనారాయణ, కొలుసు బలరాం తదితరులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. బొమ్ములూరు, మడిచర్ల, కానుమోలు, కొత్తపల్లి, మల్లవల్లి, బిళ్లనపల్లి, ఆరుగొలను, పెరికీడు, కోడూరుపాడు, కొయ్యూరు గ్రామాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు.

గన్నవరం : మండలంలో శ్రీరామనవమి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. దావాజీగూడెంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారి తిరుకల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపారు. తొలుత ఆలయ అర్చకులు ఎన్.రామాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, ఎదుర్కోలు ఉత్సవం జరిపారు. రక్షాబంధన్, కన్యాదానం, సుముహూర్తంలో మాంగల్యధారణ జరిపించారు. 9 మంది దంపతులు పీటల మీద కూర్చున్నారు. అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక జడ్పీహైస్కూల్ క్రీడా ప్రాంగణంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కేవీఆర్ కిషోర్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించి వాకర్స్ అందరికి పానకం పోశారు. గౌరవ అధ్యక్షులు తిరివీధి వెంకయ్య పాల్గొన్నారు. కమ్మవారి రామాలయం, రజక రామాలయం, గాంధీ బొమ్మ సెంటర్‌లో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు.

ఉంగుటూరు : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం ఆదివారం వాడవాడలా కన్నుల పండువుగా నిర్వహించారు. తెల్లవారుజామునుంచే మండలంలోని రామాలయాలు రామనామస్మరణతో మార్మోగాయి. లంకపల్లి రామాలయంలో అర్చకులు చదలవాడ కుమారస్వామి, శివనాగేశ్వరరావు, గాది ప్రసాద్‌శర్మ నేతృత్వంలో సీతారాముల కల్యాణం వైభవోపేతంగా జరిగింది. ఈ సందర్భంగా లవ. కుశుల వేషధారణలో చిన్నారులు అలరించారు. ముక్కపాడు, పెదఅవుటపల్లి, ఆత్కూరు గ్రామాల్లో శ్రీరాములోరి కల్యాణం శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆత్కూరు రామాలయంలో గ్రామపెద్దలు సుంకర పద్మశ్రీ వేదపండితులను ఘనంగా సత్కరించారు.

విజయవాడ రూరల్ : శ్రీరామనవమిని పురస్కరించుకుని విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో రామాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు ఆదివారం కనుల పండువుగా జరిగాయి. నున్నలోని కోదండ రామాలయంలో భద్రాచలం ఆలయం తరహాలో కల్యాణం, పూజా మహోత్సవాలు ఘనంగా జరిగాయి. అంబాపురంలోని దాసాంజనేయ ఆలయంలో కల్యాణం నిర్వహించిన నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎన్‌వి. రాఘవులు, టీడీపీ నేత గొడ్డళ్ల చిన్నరామారావు తదితరులు పాల్గొన్నారు. పి. నైనవరంలోని కోదండ రామాలయంలో భక్తులకు అన్నసంతర్పణ జరిగింది.

ప్రసాదంపాడు : ఎనికేపాడులోని కోదండరామాలయంలో సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విజయవాడ రూరల్ మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కోనేరు సందీప్ దంపతులు వేదపండితుల సమక్షంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని జరిపించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

పెనమలూరు : మండలంలో శ్రీరామనవమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పెనమలూరు, పోరంకి, తాడిగడప, కానూరు, యనమలకుదురులోని ఆలయాల వద్ద భక్తులు క్యూలో నిలుచొని స్వామివారి దర్శనం చేసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పోరంకిలో ఇటీవల నిర్మించిన కోదండరామస్వామి ఆలయం వద్ద వేడుకలు వైభవంగా నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ వేడుకలో నూతన దంపతులు బోడె వెంకట్రామ్ రీతిక దంపతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

● యనమలకుదురు చినవంతెన వద్ద ఉన్న గౌడ రామాలయంలో ఏపీ గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరాంప్రసాద్ దంపతులు శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుల సహకారంతో ఐదు వేల మందికి అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. రాముడు చూపించిన ధర్మమార్గాన్ని అనుసరిస్తే అందరి జీవితాల్లో శాంతి, ఆనందం, విజయాలు వెల్లివిరుస్తాయని శివరాంప్రసాద్ పేర్కొన్నారు.

కంకిపాడు : మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కంకిపాడు మండలంలోని పునాదిపాడులోని రామాలయంలో, కంకిపాడు ఆంజనేయస్వామి దేవాలయంతో పాటు ప్రొద్దుటూరు గాయత్రి విహార్‌లోని సాయి మంది రంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పునాదిపాడులో నిర్వహించిన రాముల వారి ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉయ్యూరు : ఉయ్యూరులో వాడవాడలా శ్రీరామనవమివేడుక నిర్వహించి సీతారాముల కళ్యాణం నేత్రపర్వంగా జరిపించారు. రామాలయాలతో పాటు ఆంజనేయస్వామి ఆలయాలు, కూడళ్లలో పందిళ్లు వేసి సీతారామ కల్యాణం చూడముచ్చటగా జరిపారు. పాతస్టేట్ బ్యాంక్ రోడ్డు కోదండ రామాలయం వద్ద నిర్వహించిన సీతారామకళ్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కనులార గాంచారు. బొల్లా నాని దంపతులతో పాటు మరో ముగ్గురు దంపతులు పీటలపై కూర్చుని రాములోరి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. స్వామివారికి కల్యాణానికి మాజీ ఛైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, అర్జునరావు, రుద్రయ్య సోదరులు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు అందజేశారు. సీఐ రామారావు సీతారామ కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. నాయీబ్రాహ్మణ రామాలయం, కాపుల రామాలయం, యాదవరామాలయంతో పాటు పలు రామాలయాలు, మండల పరిధి చినఓగిరాల, ఆకునూరు త దితర గ్రామాల్లో రామాలయాల వద్ద సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించారు.


ఉయ్యూరు పాత స్టేట్‌బ్యాంక్ రోడ్డు కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం.. యనమలకుదురు గౌడ రామాలయంలో అన్నసంతర్పణ


ఉయ్యూరులో వైభవంగా శోభాయాత్ర

ఉయ్యూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి పురస్కరించుకుని విశ్వహిందుపరిషత్ ఉయ్యూరు ఖండ, కోదండరా మాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. అశేష భక్తులు తరలిరాగా పాత స్టేట్ బ్యాంక్ రోడ్డులో కోదండ రామాలయం వద్ద నుంచి కో లాటాలు, భజనలతో జై శ్రీరామ్ నినాదంతో బయలు దేరి పట్టణ వీధుల్లో శోభాయాత్ర నేత్రపర్వంగా సాగింది. మహిళలు దీపారాధనలతో వెంటరాగా యాత్ర దేదీప్య మానంగా జరిగింది. వందలాది మంది భక్తులు ఉత్సాహంగా యాత్రలో పాల్గొని జై శ్రీరామ్ నినాదంతో హోరెత్తిం చారు. ఆలయ కమిటీ రాము, నెహ్రూ, విశ్వహిందు పరిషత్ సభ్యులు రమణ, నాగరాజు, శ్రీరఘురామ్ పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

ఆ పార్టీ సీనియర్ నేత చిగురుపాటి కుమారస్వామి


బీజేపీ జెండా ఎగురవేసి నాయకులకు నివాళులర్పిస్తున్న కుమారస్వామి

గన్నవరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ సీనియర్ నేత, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జెండా ఎగురవేసి దీన్ దయాళ్ ఉపాధ్యాయ, భారతమాత, శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు నీలం అశోక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ కురమద్దాలి ఫణికుమార్, కానూరు శేషుమాధవి, సీతారామయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, నల్లూరి కోటేశ్వరరావు, మేడూరి శేషుబాబు, వెంకటకృష్ణ, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : దేశాన్ని సర్వోన్నతంగా తీర్చిదిద్దడానికి కేంద్రంలో ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఆ పార్టీ కృష్ణాజిల్లా కార్యదర్శి సింగవరపు భాస్కర్ గణేశ్ అన్నారు. బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవం వేడుకను ఆదివారం బాపులపాడు హనుమాన్‌నగర్‌లో నిర్వహించారు. పార్టీ పతాకాన్ని భాస్కర్ ఆవిష్కరించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కెల్ల చింతారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు తోట మురళీధర్, జింకా నలగామరాజు తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు : బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పెనమలూరు యూనియన్ బ్యాంకు వద్ద ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజాబాబు, రాష్ట్ర వారధి సమన్వయకర్త కిలారు దిలీప్, పార్టీ సీనియర్ నాయకులు వల్లూరు శ్రీమన్నారాయణ, సకుర్తి శ్రీనివాస్, రామినేని వెంకటకృష్ణ, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు గోపిశెట్టి దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి శేషుకుమార్, విజయేంద్ర కుమార్, దాసరి రవికుమార్, వెలగపూడి నాగభూషణం, తాతినేని శ్రీరాం, కంకిపాడు మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.


బాపులపాడు హనుమాన్‌నగర్‌లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం.. పెనమలూరులో..


చెత్త డంపింగ్ వాహనాలను అడ్డుకున్న స్థానికులు

కానూరులో చెత్త డంపింగ్‌పై ఆగ్రహం

పెనమలూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : అనధికార చెత్త డంపింగ్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ కానూరు గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం చెత్త డంపింగ్ చేసే వాహనాలను అడ్డుకొని తీవ్రస్థాయిలో నిరసన తెలిపారు. నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు ప్రైవేట్ స్థలాల్లో, రోడ్లపైనా వ్యర్థాలను పడవేస్తుండడంతో వాటివల్ల ఆరోగ్యపరమైన సమస్యలకు స్థానికులు గురి అవుతున్నారని వాపోయారు. వ్యర్థాలతో ఉన్న వాహనాలను నిలిపివేసి అధికారులకు సమాచారమిచ్చారు. కానూరులో డంపింగ్ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

టీడీపీ నేత రాజేశ్వరరావుకు అభినందన



హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఏపీ మాల కార్పొ రేషన్ డైరక్టర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం అభినందించారు. ఆదివారం రాజేశ్వ రరావు నివాసంలో సూర్యం కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. సూర్యంతో పాటు తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి గండేపూడి నిలీష్‌కుమార్ ఉన్నారు.

బీసీ సమరభేరిని విజయవంతం చేయండి

కంకిపాడు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : బీసీ సమరభేరిని విజయవంతం చేయాలని బహుజన సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షులు గుంటూరు నాగే శ్వరరావు అన్నారు. స్థానిక మండే పూడి నాగభూషణ్ రెడ్డి భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ, ఈ నెల 11న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిర్వహించనున్న సమరభేరిని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గుదే జయప్రకాష్, ఆశీర్వాదం, గోవాడ బెర్నాడ్‌షా, వి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గుంటూరు నాగేశ్వరరావు

భారీ అన్నసమారాధన



ఉయ్యూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి పురస్కరించుకుని ఉయ్యూరులో రామాలయాల వద్ద అన్న సమారాధన చేశారు. కోదండరామాలయం వద్ద మూడువేల మందికి అన్న సమారాధన చేయగా పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. నాయీ బ్రాహ్మణ రామాలయం, కాపుల రామాలయం వద్ద అన్న సమారాధన చేశారు. కోదండ రామాలయ కమిటీ, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని సేవలందించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	123, 132, 143
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 440

పోలవరం రామాలయానికి పల్లకీ వితరణ

పామర్రు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని పోలవరంలోని రామాలయానికి స్వామివారి ఉత్సవ ఊరేగింపునకు రూ. 60వేల విలువగల పల్లకిని ఆదివారం పామర్రుకు చెందిన రత్నంసుబ్రమణ్యం, అమ్మాజీ దంపతులు వితరణగా ఆలయానికి అందజేశారు. కార్యక్రమంలో పోలవరంగ్రామ సంక్షేమ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.


స్వామివారికి పల్లకీ అందించిన రత్నంసుబ్రమణ్యం, అమ్మాజీ దంపతులు

రమణీయం రాములోరి కల్యాణం


గుడివాడలోని కోదండరామాలయంలో ..

గుడివాడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం వాడవాడలా సీతారాముల కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పెద్దశివాలయం ఎదురుగా గల కోదండరామాలయం వద్ద చలువ పందిళ్లను ఏర్పాటు చేసి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పులిహోర, పానకాలను పంపిణీ చేశారు. స్థానిక ఆంజనేయపేటలోని కోర్టు రామాలయంలో జరిగిన కల్యాణ మహోత్సవంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వేంచేసియున్న కోదండరామాలయంలో నిర్వాహకులు డొక్కు రాంబాబు నేతృత్వంలో సీతారాముల కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు పానకం, ప్రసాదాలను పంపిణీ చేశారు. స్థానిక బేతవోలులోని ఇందిరానగర్ కాలనీ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి ఆలయం, మందపాడులోని కోదండరామాలయం, కాకర్ల వీధిలోని రామాలయం, రాజేంద్రనగర్‌లో భక్త బృందం ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణమండపంలో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోదరుడు వెనిగండ్ల రామకృష్ణ(నాని), చేకూరు జగన్మోహన్‌రావులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. స్థానిక రైతుబజారు వద్ద గల భక్తాంజనేయస్వామి దేవస్థానంలో ఫ్రూట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవానికి వన్‌టౌన్, టూటౌన్ సీఐలు కొండపల్లి శ్రీనివాస్, సి.హెచ్ నాగప్రసాద్‌లు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులోని పెద్ద శివాలయం సమీపంలో ది గుడివాడ ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ అధినేత పల్లపోతు వెంకట నాగబాబు ఆధ్వర్యంలో 4,000 మందికి టూటౌన్ సీఐ సి.హెచ్ నాగప్రసాద్ పానకాన్ని పంపిణీ రాష్ట్ర శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం సభ్యులు పాల్గొన్నారు.


కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా

గుడివాడరూరల్ : మోటూరులోని సీతారాముల స్వామి దేవాలయంలో అపర భద్రాద్రిగా పేరుగాంచిన సీతారామస్వామి తిరు కల్యాణ మహోత్సవం ఆలయ అర్చకులు, వేదపండితులు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ వంశస్థుల ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు, మోటూరు గ్రామస్థుల సహకారంతో వేలాది మంది భక్తులు నడుమ కల్యాణం జరిగింది. అనంతరం అన్నసమారాధన చేశారు. ఆలయ మేనేజర్ గొరిపర్తి మౌనిక దేవాదాయ, ధర్మదాయ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో రూరల్ ఎస్సై చంటిబాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఆర్ఐ నాగబాబు, దేవాదాయ, ధర్మదాయశాఖల సమన్వయంతో సీతారాముల కల్యాణం నిర్వహించారు.


కూచిపూడిలో నవమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

గుడివాడ రూరల్ : శ్రీరామనవమిని పురస్కరించుకుని రామచంద్రాపురంలో కాసరనేని జనార్థనరావు నిర్మించిన కోదండ రామమందిరంలో సీతారాముల కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉప్పలపాటి సతీష్ - రూన్సీ, పడిమిముక్కల ప్రశాంతి - రవీంద్ర దంపతులు కల్యాణం నిర్వహించారు. బొమ్ములూరు, బిళ్లపాడు , దొండపాడు, చౌటపల్లిలో ఆలయ భక్త బృందం కమిటీ ఆధ్వర్యంలో సీతారామ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గుంటాకోడూరు, గోల్వేపల్లి, లింగవరం, వలివర్తిపాడు గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని భక్తులు నిర్వహించారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులో వాడవాడలా సీతారామ కళ్యాణ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. గుడ్లవల్లేరులో తూర్పువైపు రామాలయం, రజకసంఘ రామాలయం, సాయిబాబా ఆలయంలో, చెరువుగట్టు కచేరిచావిడిలో, రైల్వేస్టేషన్ రోడ్డు యువత ఏర్పాటు చేసిన పందిరిలో, మార్కెట్ లోని ఆలంజనేయ స్వామి ఆలయంలో రాములోరి కల్యాణం నిర్వహించారు. కౌతవరం, డోకిపర్రు శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో, మామిడికోళ్ల రామాలయంలో, పెంజేంద్ర, అంగలూరు రామాలయాలలో సీతారాముల కల్యాణం కన్నులపండుగగా నిర్వహించారు.

కూచిపూడి : శ్రీరామనవమి వేడుకలను వాడవాడలా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చినముత్తేవి, కూచిపూడి, అయ్యంకి అడ్డరోడ్డు, మొవ్వ, కాజ, కోసూరు, భట్లపెనుమర్రు, నిడుమోలు తదితర గ్రామాల్లో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.

నందివాడ : శ్రీరామనవమిని పురస్కరించుకుని నందివాడ, జనార్ధనపురం, పుట్టగుంట, పెదలింగాల, తుమ్మలపల్లి, కుదరవల్లి, లక్ష్మీనరసింహాపురం, పెదవిరివాడ, పొనుకుమాడు, పొలుకొండ, తమిరిశ పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. తమిరిశ, లక్ష్మీనరసింహాపుర, కుదరవల్లి, పోలుకొండ యాదవ కోదండ రామాలయం వద్ద సుమారు రెండువేల మందికి అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పామర్రు : జిల్లాలో ప్రసిద్ధి చెందిన ప్రముఖ హనుమాన్ దేవాలయాల్లో ఒకటైన పామర్రులోని ఉండ్రపూడి-పోలవరం అడ్డ రోడ్డువద్ద గల వీరాంజనేయ దేవాలయంలో ఆదివారం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి కల్యాణ వేడుకల్లో పలువురు ఉభయదాతలుగా హజరై కల్యాణాలు, ప్రత్యేక పూజాదికాలు జరిపించారు.ఆలయాధికారి ప్రసాదరావు, ప్రధాన అర్చకులు శేషుబాబు, బెతనబోట్ల సుబ్బారావు పాల్గొన్నారు.


నందివాడలో అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

తోట రామాలయంలో స్వామి కల్యాణోత్సంలో ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా హజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టినరేష్, కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, అల్లంశెట్టి సురేష్, మధు పాల్గొన్నారు. వెలమపేట రామాలయంతోపాటుగా నాయిబ్రహ్మణకాలనీ, రజకుల కాలనీ, కురుమద్దాలి, కోరముక్కువానిపురం తదితర ప్రాంతాల్లోని రామాలయాల్లో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా హజరై స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వడపప్పు, పానకం భక్తులకు అందజేశారు.

పమిడిముక్కల: చోరగుడిలో పురగిరి క్షత్రియ పెరి సంఘ రామాలయంలో సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి, సుబ్రమణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో సీతారామ కల్యాణం కన్నుల పడుగగా నిర్వహించారు.


రామచంద్రాపురంలో కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

ఆలయానికి తాడేపల్లిగూడెం సీఏ అత్తి సుబ్రమణ్యం, కల్యాణి దంపతులు హనుమాన్ సమేత శ్రీరామ పరివార నూతన విగ్రహాలు సమర్పించి పీఠలపై కూర్చుని స్వామి కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, జనసేన నాయకుడు తాడిశెట్టి నరేశ్, కూటమి నాయకులు పాల్గొన్నారు. పూర్ణకుమారి సుబ్రహ్మణేశ్వరరావు దంపతులచే 500 మందికి పైగా అన్న సమారాధన చేశారు.

పెదపారుపూడి : వెంట్రప్రగడలోని టీడీపీ కార్యాలయంలో సీతారామ కల్యాణం సందర్భంగా ప్రసాదాలు, పానకాలు పంపిణీ చేశారు. మండల అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి ఆధ్వర్యంలో నాయకులు కూచిపూడి సుబ్బయ్య, నీటి సంఘం అధ్యక్షులు కూచిపూడి శ్రీనివాసరావు, పొనుగంటి సత్యనారాయణ, గొరిపర్తి రవికుమార్, మాయ విజయబాబు ప్రసాదాలు, పానకం పంచి పెట్టారు.పెదపారుపూడిలోని సీతారాముల దేవస్థానంలో పునుకొల్లు సూర్యనారాయణ దంపతులు, పొట్లూరి లోకేష్ దంపతులు పీటల మీద కూర్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన చేశారు. గారపాటి వీర నాగబాబురావు, పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరులో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు ఆట్టహాసంగా జరిగాయి. తోట్లవల్లూరు ఉచిత ఇసుక క్వారీ వద్ద కార్మికులు నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి పాల్గొన్నారు. కార్మికులకు పానకం అందించారు. సీతారాముల కల్యాణోత్సవాలు కన్నుల పండువగా జరిపారు. భక్తులకు బెల్లం, మిరియాలతో చేసిన పానకాన్ని అందించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో రామాలయాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు.


గుడ్లవల్లేరులో ఉత్సవ విగ్రహాలను తీసుకు వెళుతున్న అర్చకులు


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రజని

గుడ్లవల్లేరులో ఉచిత వైద్య శిబిరం

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మధుమేహ చికిత్సా శిబిరాన్ని నిర్వహించారు. 100 మంది రోగులను గుడివాడకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ గవిర్నేని రజని పరీక్షించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు నిమ్మగడ్డ శశికళ, కార్యదర్శి మేరుగు పెరుమాళ్లు, చాపరాల రాజేశ్వరరావు, సూరపనేని పరందామయ్య, చాపరాల బాలాజీ తదిరతులు పాల్గొన్నారు.


వేమవరం కొండాలమ్మను దర్శించుకున్న ఎస్.వి.సాంబశివరావు, అనుదీప్

కొండాలమ్మ సేవలో ప్రముఖులు

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారిని ఆదివారం మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి కుమారుడు వల్లభనేని అనుదీప్, జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి ఎస్.వి.సాంబశివరావు అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వారిని ఆలయ అర్చకులు శేషవస్త్రంతో సత్కరించి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, వెణుతురుమిల్లి సర్పంచ్ కొప్పినేని శేషవేణి, సంధు పవన్, జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


గుడివాడలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

గుడివాడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పాలనలో కుంభకోణాలమయంగా తయారు చేశారని, దేశాన్ని అవినీతి రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రధాని మోడీ చేస్తున్న కృషి మరువలేనిదని బీజేపీ జిల్లా కార్యదర్శి అంగడాల సతీష్ అన్నారు. ఆదివారం స్థానిక సత్యనారాయణపురంలోని కిన్నెర కాంప్లెక్స్ ఎదురుగా బీజేపీ కార్యాలయంలో టూటౌన్ అధ్యక్షులు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) ఆధ్వర్యంలో పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం పార్లమెంట్ కన్వీనర్ సూరే గాంధీ, జనార్ధన్, చిన్నా, బోనం గోపిక, రీటా, రాజు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : గుడివాడ రూరల్ మండలం సేరిదింటకురు గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ జెండాను ఆవిష్కరించారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బీజేపీ కార్యాలయం వద్ద పార్టీ జండాను రాష్ట్ర నాయకులు డాక్టర్ సీఎల్.వెంకటరావు ఆవిష్కరించారు. అనంతరం నియోజకవర్గ పార్టీ కన్వినర్ దావులూరి సురేంద్రబాబు కేక్‌ను కట్‌చేశారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ మట్టా ప్రసాద్, జిల్లాపార్టీ ఉపాధ్యక్షులు అట్లూరి దిలీప్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు నగేష్, పార్టీ మాజీ అధ్యక్షులు వడ్లమూడి రవీంద్ర, పార్టీ నాయకులు వైపిసి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అపార్టుమెంట్‌లో అగ్ని ప్రమాదం

● రూ.3లక్షల ఆస్తి నష్టం

గుడివాడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆర్టీవో కార్యాలయం ఎదురుగా ఉన్న అపార్టుమెంట్ రెండో ఫ్లోర్‌లోని ప్లాట్ నెం.202లో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి వెళ్లిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. చుట్టూపక్కల ప్లాట్‌లకు మంటలు వ్యాపించకుండా అదుపులోకి తీసుకువచ్చారు. ప్లాట్ యజమాని వెంకటేశ్వరరావు ఉదయం ఇంట్లో దీపారాధన చేసి ఆలయానికి వెళ్లారు. దీపారాధన కుందీ ద్వారానే మంటలు వ్యాపించి, సుమారు రూ.3లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని అగ్నిమాపక అధికారులు పేర్కొన్నారు.


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జాతీయ ప్రతిభా అవార్డుకు ఉపాధ్యాయురాలి ఎంపిక

గుడివాడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : సదరన్ ప్రైవేట్ టీచర్స్ ఆర్గనైజేషన్(ఎల్‌పిఎల్‌టివో) వారి ఆధ్వర్యంలో అందజేసే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ ప్రతిభా అవార్డుకు స్థానిక విద్యాలయ పాఠశాల సీనియర్ తెలుగు ఉపాధ్యాయురాలు మేరుగు వెంకట రమణ ఎంపికైనట్టు పాఠశాల డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేదీన గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన్ మందిరంలో జరుగు అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో వెంకటరమణ అవార్డును అందుకోనున్నట్టు ఆయన పేర్కొన్నారు. గత 28ఏళ్లుగా మాతృభాషలో వెంకటరమణ వ్యక్తిగత శ్రద్ధతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారని, అవార్డు రావడం పట్ల డైరెక్టర్ విజయభాస్కర్ హర్షం వ్యక్తం చేశారు.


మేరుగు వెంకట రమణ

దాహార్తిని తీర్చడంలో చలివేంద్రాలే మేలు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న యలవర్తి శ్రీనివాసరావు

గుడివాడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : బాటసారుల దాహార్తిని తీర్చడంలో చలివేంద్రాలే మేలని ఎన్టీ ఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక స్టేడియంరోడ్డులో ఎన్టీ ఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. శ్రీరామనవమి సందర్భంగా బాటసారులకు పానకాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, కమిటీ సభ్యులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.


శిథిలావస్థకు చేరుకున్న అంగన్వాడీ కేంద్రం


ప్రాంగణంలో పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవిలా కనిపిస్తున్న అంగన్వాడీ కేంద్రం

శిథిలావస్థలో అంగన్వాడీ కేంద్రం

పమిడిముక్కల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : హనుమంతపురంలో రావిచెట్టు సెంటర్‌లోని అంగన్వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరింది. వైసీపీ హయాంలో అంగన్వాడీలోని పిల్లలను దూరంగా ఉన్న ఎలిమెంటరీ స్కూల్‌కు అప్పగించారు. దీంతో చిన్నారులు ఎలిమెంటరీస్కూల్‌కు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. సంవత్సరాల తరబడి ఈ అంగన్వాడీ భవనం నిరుపయోగంగా ఉండటంతో ప్రాంగణమంతా పొదలు,పిచ్చి మొక్కలు పెరిగి చిట్టడవిలా తయారైంది. దీంతో పాములు, క్రిమికీటకాదులతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు. భవనానికి ఉన్న ప్రహరీ గోడ ఓవైపు కూలిపోగా మరో వైపు కూలేందుకు సిద్ధంగా ఉండడంతో ఆ ప్రాంత ప్రజలు భయపడతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	123, 132, 143
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 440

నెలాఖరులోగా ఆస్తిపన్ను చెల్లిస్తే 5శాతం రాయితీ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను ఏకమొత్తంలో ఏప్రిల్ 30లోగా చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ఇస్తున్నట్టు మునిసిపల్ కమిషనర్ బాపిరాజు తెలిపారు. ఆస్తిపన్ను, ఖాళీస్థలాల పన్ను చెల్లించే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రోజూ ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు మునిసిపల్ కార్యాలయంలో ఆస్తిపన్నులు కట్టించుకునే వారికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు.





భద్రాద్రి రామాలయంలో సీతారాముల కల్యాణం, హాజరైన భక్తులు



బందరుకోట రామాలయంలో కల్యాణం జరిపిస్తున్న మంత్రి రవీంద్ర



బందరు జోశ్యులవారితోట రామాలయంలో సీతారాముల కల్యాణం

మార్మోగిన రామనామం

● నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం ● తిలకించి తరించిన భక్తజనం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా రామనామం మార్మోగింది. శ్రీరామనవి వేడుకలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బందరుకోట కోదండ రామాలయంలో మంత్రి కొల్లు రవీంద్ర, నీలిమ దంపతులు స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గుడివాడ ప్రణావనంద ఆశ్రమ అధిపతి స్థైర్యానంద సరస్వతి స్వామి అభిభాషణం చేశారు. గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మాజీ కౌన్సిలర్ బచ్చుల అనిల్‌కుమార్, తలారి సోమశేఖర్, పిప్పళ్ళ కాంతారావు, గోపు సత్యనారాయణ, రామధాని వేణు తదితరులు పాల్గొన్నారు. రుస్తుంబాద భద్రాద్రిరామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి శిరీష కార్యక్రమాలను పర్యవేక్షించారు. బచ్చుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం జరిపారు. పరాసుపేట ఆంజనేయ స్వామి దేవాలయంలో కార్యనిర్వహణాధికారి టీవీవీ మోహనరావు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం జరిగింది.

● జోశ్యులవారితోట రామాలయంలో కమిటీ నేతలు గొర్రె హరిబాబు, గొర్రె రాము, బుద్ధన బాబి, కొలసాని శ్రీహరి, దేవనబోయిన శంకర్, రావి మణికంఠ, శ్రీనివాస్, మధు, శివ తదితరుల పర్యవేక్షణలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది.

● చిన్నాపురం, కానూరు, కోన, తాళ్ళపాలెం, మంగినపూడి, పోతేపల్లి, చిట్టిపాలెం గ్రామాల్లోని రామాలయాల్లో స్వామి వారి కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిపారు.





జోశ్యులవారితోటలో నూతనంగా ప్రతిష్ఠించిన రామాలయంలో కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



నాగాయలంకలో బుద్దప్రసాద్ దంపతులు

చిల్లిముంత చిరంజీవి, ఉపాధ్యక్షుడు నారగాని నంద, పడమట మహేంద్ర, చిల్లిముంత వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఎ తోటమూలలోని రామాలయంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వరుదు రామకృష్ణ పర్యవేక్షణలో సీతారాముల కల్యాణం కన్నుల పండగగా జరిగింది. అన్నసమారాధన నిర్వహించారు. కాపులవీధి రామాలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. అన్నసమారాధన జరిగింది. రజక సంఘం ఆధ్వర్యంలో కొత్తపేట రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. రజక సంఘ నాయకులు పోతార్లంక నాగేశ్వరరావు, కూరేటి ఈశ్వరరావు, పోతార్లంక నాని తదితరులు పాల్గొన్నారు. **పెడన రూరల్ :** మండలంలోని చెన్నూరు, ఉరివి, కమలాపురం, చేవేంద్ర, కవిపురం, నడుపూరు, నందిగం, బల్లిపర్రు, మడక, నందమూరు, కాకర్లమూడి, గౌడపాలెం, పెనుమల్లి, కొప్పల్లి, ముచ్చర్ల, జింజేరు రామాలయాల్లో శ్రీరామనవమి జరిపి, అన్న సమారాధన చేశారు.

కోడూరులో సాయి మందిరంలో..

కోడూరు : కోడూరు షిర్డి సాయి దివ్య జ్ఞాన ధ్యాన మందిరం నందు సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ట్రాక్టర్‌పై పురవీధులలో ఊరేగించారు. ఏర్పాట్లను చైర్మన్ రేపల్లె వెంకట నారాయణ పర్యవేక్షించారు.



ఘంటసాల రజకుల రామాలయంలో..

ఘంటసాల : రజకుల రామాలయం వద్ద శ్రీరామనవమి వేడుక అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితులు కళ్యాణమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. తూములూరి వెంకటేశ్వరరావు - ఫణి స్వరూప, మల్లంపల్లి ఆంజనేయులు - అలివేలు మంగమ్మ, కొల్లిపర మురళీ కృష్ణ - వీరనాగమణి దంపతులచే స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. స్వామివారి కల్యాణాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. **నాగాయలంక :** భగత్ సింగ్ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన నవమి వేడుకల్లో ఎస్ఐ కె.రాజేష్, ఆటో వర్కర్లు పాల్గొన్నారు భావదేవరపల్లిలో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. **అవనిగడ్డ రూరల్ :** మోదుమూడి రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. సతీష్ కుమార్ శర్మ - ధనలక్ష్మి దంపతులచే స్వామి వారి కల్యాణం జరిగింది. ఆలయ ధర్మకర్తల బచ్చు గగాధర్, జగదీష్ ప్రసాద్, విద్యావలంటీర్ బచ్చు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** అవనిగడ్డలోని 3, 7వార్డుల్లోని కోదండ రామాలయాల్లో శ్రీరామనవమి సందర్భంగా స్వామివారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. కొత్త ఎడ్లంకలో కోదండ రామాలయంలో వడ్లమూడి శశి - నీలిమ దంపతులు కల్యాణాన్ని నిర్వహించగా, అవనిగడ్డ మూడో వార్డులోని కోదండ రామాలయంలో అన్నపరెడ్డి హర్షవర్ధన్ - రమ్యశ్రీ దంపతులు, రేపల్లె సోమ వెంకట ఫణీంద్ర - లక్ష్మీ మౌనిక దంపతులు సీతారాముల కల్యాణం జరిపించారు. కొత్త ఎడ్లంకలో అన్నప్రసాద వితరణ జరిగింది. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పాల్గొన్నారు. మూడో వార్డులోని కోదండ రామా లయంలో జరిగిన వేడుకల్లో ఆలయ ధర్మకర్త అన్నపరెడ్డి కృష్ణ, అన్నపరెడ్డి శ్యామ్ సుందర్, వెంకటేశ్వరరావు, ఓంకార్ నాగభూషణం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** చల్లపల్లి తూర్పువీధి రామాలయం, ఉప్పల వారి రామాలయం, రజకపాలెం రామాలయం, బస్టాండ్ సెంటరు రామాలయం, ఎస్టీ కాలనీ, నారాయణరావునగర్ శ్రీప్రసన్న భక్తాంజనేయస్వామి ఆలయం తదితర ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ప్రధాన సెంటరులోని శ్రీలక్ష్మీ గణపతి దేవాలయం వద్ద నవమి వేడుకలు జరుగ్గా, అవనిగడ్డ డీఎస్పీ టి.విద్యశ్రీ, నేతలు కొనకళ్ల బుల్లయ్య, మండలి వెంకట్రామ్, సీఐ కె.ఈశ్వరరావు, ఎస్ఐ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. రామానగరంలోని కోదండరామాలయం, లక్ష్మీపురం, మంగళాపురం, మాజేరు, పురిటిగడ్డ, మేకావారిపాలెం, పాగోలు, నడకుదురు, వెలివోలు, వక్కలగడ్డ, యార్లగడ్డ, చింతలమడ గ్రామాల్లోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలు, విష్ణాలయాల్లో వేడుకలు జరిగాయి. అన్నసమారాధనలు జరిపారు. **గూడూరు :** మండలంలో శ్రీరామనవమి పండుగ ఘనంగా జరుపుకున్నారు. తరకటూరు గ్రామంలో గ్రీన్‌కో డైరెక్టర్, సిద్ధార్థ ఇన్ఫోటెక్స్ చైర్మన్ బండారి నరసింహారావు, రాధా రమణి దంపతులు సీతారామ కల్యాణం జరిపి, మహిళలకు పసుపు, కుంకుమ, చీరెలు పంపిణీ చేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలు జరిపారు. ఈ కార్యక్రమంలో తరకటూరు ఎంపీటీసీ జక్కా ధర్మారాయుడు, మాజీ సర్పంచ్ జక్కా వెంకట నరసింహారావు, రత్తయ్యనాయుడు, కేశవ, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **మోపిదేవి :** మండలంలోని వెంకటాపురం, రావివారిపాలెం, మోపిదేవి, అన్నవరం, పెదకళ్లేపల్లి, పెదప్రోలు గ్రామాల్లో సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. ఆయా రామాలయాల వద్ద అన్నసంతర్పణ గావించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



వెంకటాపురం రామాలయంలో..



తరకటూరు రామాలయంలో..



పెడన బస్టాండ్ సెంటర్‌లో

పెడన : బస్టాండ్ సెంటర్‌ల సీతారామాంజనేయ స్వామి ఆలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సీతారామకల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. గౌడ సంఘం అధ్యక్షుడు పడమట బలరామ్, కార్యదర్శి

మణి ప్రభాకరరావు మాస్టారు కన్నుమూత



చల్లపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొక్కిలిగడ్డ మణిప్రభాకరరావు(75) కన్నుమూశారు. తీవ్రమైన గుండెపోటు రావటంతో తొలుత స్థానికంగా ప్రవేటు ఆసుపత్రిలో అత్యవసర చికిత్స అందించి, మెరుగైన చికిత్సల కోసం మణిపాల్ ఆసుపత్రికి తరలించగా అక్కడ తుదిశ్వాస విడిచారు. ఘంటసాల మండలం చిట్టూర్పు యూపీ పాఠశాలలో సుదీర్ఘకాలంపాటు ప్రధానోపాధ్యాయునిగా పనిచేసిన ఆయన జిల్లా, రాష్ట్ర, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. మణిప్రభాకరరావు మాస్టారు భౌతికకాయాన్ని వక్కలగడ్డలోని స్వగృహానికి తీసుకురాగా, వివిధ రంగాల ప్రముఖులు సందర్శించి నివాళులు అర్పించారు.

చెట్టుపై నుంచి పడి కల్లుగీత కార్మికుడు మృతి

కోడూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కల్లు గీసేందుకు తాడిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు జారి పడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉల్లిపాలెం గ్రామానికి చెందిన ఉప్పాల యేసు శనివారం సాయంత్రం కల్లు గీస్తూ జారి కింద పడటంతో స్థానికులు అవనిగడ్డ ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. కానీ అప్పటికే యేసు మృతి చెందారని వైద్యులు నిర్ధారించినట్లు వారి కుటుంబసభ్యులు తెలిపారు. యేసు భౌతికకాయాన్ని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాకా రామచంద్రరావు సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కార్పొరేషన్ల రుణ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు రేపు

పెడన, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 8వ తేదీ ఉదయం 11 గంటలకు మునిసిపల్ కార్యాలయంలో బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని కమిషనర్ ఎం. గోపాలరావు తెలిపారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, రైస్ కార్డు, కులధ్రువీకరణ పత్రం ఒరిజినల్స్‌తో రావాలన్నారు. రవాణా రంగానికి సంబంధించిన రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న డ్రైవింగ్ లైసెన్స్ కూడా తీసుకురావాలన్నారు. సబ్సిడీ రుణాల కోసం పట్టణ పరిధిలో మొత్తం 373 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు.

అగ్ని బాధితులకు సాయం

మోపిదేవి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి అగ్నిబాధిత మోర్ల సీతామహలక్ష్మి, పెండ్ర మురిసిరి, సింగోతు రాంగారావు, రాజులపాటి రాజేశ్వరి కుటుంబాలకు మండలి వెంకట్రామ్ వస్త్రాలు, చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. టీడీపీ మండల మాజీ కొల్లి మురళీ, మోపిదేవి ఉపసర్పంచ్ కోనేరు సుందర్ సింగ్, టీడీపీ నేత పరుచూరి శ్రీనివాసరావు కుటుంబానికి రూ.2500 చొప్పున ఆర్థిక సాయం, నిత్యావసరాలు, కూరగాయలు, బియ్యం అందించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మోపిదేవి సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో హెవీ టార్పాలిన్లు, హైజినిక్ కిట్స్, వంట పాత్రలను అందజేశారు. సబ్ బ్రాంచ్ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు, ఉపాధ్యక్షులు రిమ్మనపూడి సుబ్రహ్మణ్యం, తుంగల వెంకటగిరి, నడకుదుటి జనార్ధనరావు, జనసేన మండల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, రంగారావు, విస్సంశెట్టి రాజా పాల్గొన్నారు.



లంకమ్మ గ్రామోత్సవం ప్రారంభం

అవనిగడ్డ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : దివిసీమ వాసుల ఇలవేల్పు లంకమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం సందర్భంగాగ్రామోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి 12వ తేదీన జరుగనున్న జాతర మహోత్సవం పోస్టర్లను ఆవిష్కరించగా, ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాస్ (వాసు) పర్యవేక్షించారు.




ఆలయ అభివృద్ధికి రూ.25 వేల విరాళం

చల్లపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి పడమరవీధిలోని వెంకట కృష్ణమ్మ రామాలయ అభివృద్ధికి చల్లపల్లి ఉపసర్పంచ్ ముమ్మనేని నాని రూ.25 వేల విరాళాన్ని అందించారు. టీడీపీ రాష్ట్ర నాయకులు కొనకళ్ల బుల్లయ్య, యువనేత మండలి వెంకట్రామ్ చేతులమీదుగా ఆలయ కమిటీ పెద్దలకు విరాళం అందజేశారు. వైస్ఎంపీపీ మోర్ల రాంబాబు, టీడీపీ నేతలు, యార్లగడ్డ శ్రీనివాసరావు, మోర్ల ప్రసాద్, బళ్లా వాసు, మోర్ల శివ, వేముల హరికృష్ణ, జనసేన నేతలు బొందలపాటి వీరబాబు, రావులపల్లి పండు గురుస్వామి, పసుపులేటి రవికుమార్, గంగిశెట్టి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాల నిర్వహణ సామాజిక బాధ్యత : డీఎస్పీ

చల్లపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : చలివేంద్రాలు ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తిని తీర్చటం సామాజిక బాధ్యత అని డీఎస్పీ టి.విద్యశ్రీ, టీడీపీ రాష్ట్రనేత కొనకళ్ల బుల్లయ్య, యువనేత మండలి వెంకట్రామ్ అన్నారు. చల్లపల్లి టాక్సీ ఓనర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో టాక్సీ స్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ ప్రారంభించారు. సీఐ కె.ఈశ్వరరావు, ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ మోర్ల రాం బాబు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, నేతలు అడ్డాడ ప్రసాద్‌బాబు, యద్దనపూడి మధు, యార్లగడ్డ శ్రీనివాసరావు, బొందలపాటి వీరబాబు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అతిథులను సన్మానించారు.



మన కోసం మనం ట్రస్ట్‌కు విరాళాలు

చల్లపల్లి, ఏప్రియల్ 6 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ సుందర చల్లపల్లి సాధనకు అభివృద్ధి, సుందరీకరణ పనులు చేస్తున్న మన కోసం మనం ట్రస్ట్‌కు దాతలు విరాళాలను అంద జేశారు. ఆదివారం 3435వ రోజు స్వచ్ఛసేవలో పాల్గొని స్వచ్ఛ సారధి, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ డిఆర్‌కె.ప్రసాద్‌కు విద్యావేత్త యార్లగడ్డ శివప్రసాద్ రూ25 వేల విరాళాన్ని, స్వచ్ఛకార్యకర్త ప్రాతూరి ఉదయశంకర శాస్త్రి రూ5వేల విరాళాన్ని అందించారు. స్వచ్ఛ కార్యకర్తల తరఫున దాతలకు డిఆర్‌కె కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ గోపాళం శివన్నారాయణ ఆదివారం స్వచ్ఛసేవలో పాల్గొన్నారు. డీఆర్కే దంపతుల నేతృత్వంలో విరామం లేకుండా స్ఫూర్తివంతంగా సాగుతున్న స్వచ్ఛఉద్యమం, స్వచ్ఛత కోసం పాటుపడుతున్న స్వచ్ఛ కార్యకర్తలను ఆయన అభినందించారు.

రామావతారానికి ఎంతో విశిష్టత

మచిలీపట్నం టౌన్ : దశావతారాల్లో రామావతరానికి ఎంతో విశిష్టత ఉందని ప్రముఖ ప్రవచనకర్త తట్టా తాండవకృష్ణ అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం సన్‌స్టార్ స్కూల్ ప్రాంగణంలో తాండవకృష్ణ ప్రసంగించారు. త్రేతాయుగంలో జన్మించిన శ్రీరామచంద్రుడు మానవుడి లాగా జీవించి గొప్ప జ్ఞానాన్ని, నైతికతను, సత్యమార్గాన్ని ప్రబోధించాడన్నారు. వాల్మీకి రామాయణంలోని ధర్మసూక్ష్మాలను వివరించారు. స్టార్ సంస్థల అకడమిక్ మెంటార్ శ్రీరామ్, స్టార్ డైరెక్టర్ స్వామి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆలయ శిల్పులకు సత్కారం

పెడన, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయ గర్భాలయ ద్వారానికి వెండితాపడం తయారు చేసిన తెనాలికి చెందిన బియ్యపు హరికృష్ణ, ఆయన శిష్య బృందాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ ఆదివారం ఘనంగా సన్మానించింది. కమిటీ చైర్మన్ బళ్ల ప్రసాద్ మాట్లాడుతూ, పురప్రముఖులు, భక్తుల సహకారంతో వెండి తాపడం చేయించామన్నారు. వెండి తాపడాన్ని త్వరితగతిన తయారు చేసి ఇచ్చిన హరికృష్ణకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చందన నారాయణరావు, మామిడి ప్రసాద్, యిమ్మడి నాగపోతరావు, వీణం శ్రీనివాస్, కమ్మగంటి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

కోడూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పర్ణశాల ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో దింటిమెరక గ్రామంలోని సర్వశక్తుని ప్రార్థనామందిరంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మచిలీపట్నానికి చెందిన డాక్టర్ ప్రవళిక బీపీ, షుగర్, అస్తమా, గుండె సంబంధిత వ్యాధులు, మోకాళ్లనొప్పులతో బాధపడే వారికి పరీక్షలు నిర్వహించారు. 122 మంది రోగులకు ప్రార్థనామందిరం ఆధ్వర్యంలో రూ.20 వేల విలువ గల మందులు ఉచితంగా అందజేశారు. పాస్టర్ పి.ఎన్.రాజు, గ్రామ ప్రముఖులు కన్నా లక్ష్మణరావు, తిరుమలశెట్టి ఆంజనేయులు, లంకే రవి, వల్లభనేని రమేష్, వైద్య సిబ్బంది, విశ్వాసులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలు నింపుకోవాలి

అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): దివిసీమలోని పంట కాలువల ద్వారా వస్తున్న నీటితో చెరువులు, కుంటలు నింపుకోవాలని ఇరిగేషన్ డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. దివిసీమలోని పంట కాలువలకు ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదలైన నీటిని ఆయన పరిశీలించారు.



ముస్లింల కొవ్వొత్తుల ర్యాలీ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మహాప్రవక్త హజ్రత్ మొహమ్మద్ కుమార్తె హజ్రత్ బీబీ ఫాతిమా జహెరా కుటుంబీకుల సమాధులను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ గిరోహి మిరన్‌షా సాహెబ్ ఆధ్వర్యంలో ఇనకుదురుపేటలో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల నిర్వహించారు. వాటిని పునర్నిర్మించాలని చాలా కాలంగా కోరుతున్నామని గిరోహి మిరన్‌షా ప్రతినిధులు పేర్కొన్నారు. మతపెద్దలు, గోరిహె మిరన్‌షా సభ్యులు పాల్గొన్నారు.